# బృంద

**అహో!** ఏమది?

అది మృత్యుంజయుని మూడవ నేత్రం! అందులోంచి వెలువడిన ఆ దుర్నిరీక్ష్య మహోజ్జ్వల తేజస్స్ఫులింగాలు మన్మథుని భస్మంచేసినాయి.

అతణ్ణి భస్మం చేయగా మిగిలిన నేత్రానలం సముద్ర గర్భంలోపడి చల్లారింది. అందుండి






ఉచిత చికిత్స

బొల్లి వగైరాలకు

మేము ఒక బుడ్డి మందు

ఉచితంగా యిస్తాము

వాడి చూడండి.

**ARUN PHARMACY, N.22**

P. O. Katrisarai (Gaya)




కిసాన్

లాంతరు

ఈ రకపువాటిలో ఉత్తమమైనది

అన్ని పెద్ద స్టోర్లలోను లభిస్తుంది

గౌర్ మోహన్ దాస్ & కం.,

233, పాత చైనాబజార్ వీధి, కలకత్తా-1.

ఫోన్: 22-6580.

# వృందా

వెలువడిన ఓ పెద్ద రోదన ధ్వని స్వర్గలోకవాసుల హృదయాలను కంపింపజేసింది.

వారంతా భయాందోళనలతో బ్రహ్మ వద్దకు పరుగెట్టారు. "మహానుభావా! ఏమిటీ మహా భయంకరమైన రోదన ధ్వని? మా పీకల మీదికి మళ్ళీ ఏ రాక్షసుడిని సృష్టించావు?" అని అడిగారు.

బ్రహ్మ కొద్ది క్షణాలసేపు ఆలోచించి "నేనెవడినీ మీ పీకలమీదికి సృష్టించలేదు. కానీ, ఆ పరబ్రహ్మ స్వరూపుడైన పరమేశ్వరుని ప్రమేయమిందులో ఉండి ఉంటుందని నా అనుమానం. మీరిక్కడే ఉండండి. నేనీ ఉదంతం తెలుసుకొని వస్తాను" అంటూ సముద్రుడి దగ్గరకు వెళ్ళాడు.

సముద్రుడు బ్రహ్మనుచూసి పరమానంద భరితుడై సాష్టాంగ నమస్కారంచేసి—"నేనీనాడు ధన్యుడిని. పరమేశ్వరుని నేత్రాగ్నిని భరించిన కారణంగా జన్మించిన పుత్రుడికి ఎవరిచే నామకరణం చేయించి ఎవరిచే జాతకం చెప్పించడమా అని ఆలోచిస్తున్న సమయంలో తాము నా భవనానికి దయచేశారు. నాయందు దయయుంచి నా కుమారునికి నామకరణంచేసి, జాతకఫలం చెప్పమని నా ప్రార్థన!" అని చేతులు జోడించి ప్రార్థించాడు.

బ్రహ్మ వానికి జలంధరుడని నామకరణం చేసి "వీనిది మహోజ్జ్వలమైన జాతకం. శివునిచే తప్ప ఇతరులచే మారకంలేదు. అదయినా వీని భార్య పాతివ్రత్యం భగ్నమైనప్పుడు మాత్రమే!" అనిచెప్పి అదృశ్యుడయ్యాడు.

• • •

జలంధరుని విద్యాభ్యాసం పూర్తయింది. సర్వశాస్త్రపారంగతుడయ్యాడు. పొంగులు వారుతున్న నవయవ్వనం మధురమైన వాంఛలను రెచ్చగొడుతున్న సమయమది. ఆ సమయంలో నవనీత కోమల వయోరుచిరాంగి అయిన వృంద అతని దృక్పథంలో పడింది.

పరస్పరంచూపులు కేంద్రీకృతమయాయి. వృంద సిగ్గుబరువుతో ఉక్కిరిబిక్కిరై తీయ తీయని కోరికల డోలికలలో ఊగిసలాడుతూ అక్కడినుండి పారిపోయింది. జలంధరుడు మోహపరవశుడయాడు. తన హృదయాన్ని చలింపజేసిన ఈ నవయౌవని ఎవరు?...

ఆమె తన తండ్రికి మిత్రుడైన కాలనేమి యొక్క గారాబుకూతురన్న సంగతి జలంధరుడు తెలుసుకొన్నాడు. మదిలోని మధురమైన వాంఛలు అతనిని ఉద్రిక్తుడినిచేసి ఒక రకమైన మనోవికారాన్ని కలుగజేసినాయి. కుమారుని మనోవికారానికి హేతువేమిటో తెలుసుకొన్నాడు సముద్రుడు. తనలో తాను నవ్వుకొని మిత్రుడైన కాలనేమికి కబురంపాడు. సముద్రుడితో వియ్యమొందడానికి కాలనేమి సంతోషంతో అంగీకరించాడు.

వృందా జలంధరుల వివాహం బ్రహ్మాండంగా జరిగింది. వృంద రాక్షసవంశంలో జన్మించినా స్త్రీ ధర్మాన్ని అనుష్ఠించడంలో మహాపతివ్రతలతో సరిసమానంగా తులతూగుతూ జీవిస్తున్నది.

ఒకనాడు జలంధరుడు నిండుకొలువులో ఉండగా రాక్షసుల గురువైన శుక్రుడు వచ్చాడు. జలంధరుడితోసహా రాక్షసులందరూ అతనికి ప్రణమిల్లారు.

శుక్రుడు అందరినీ ఆశీర్వదించి, ఉచితాసనంపై ఉపవిష్టుడై "జలంధరా!...ఈనాడు దేవతల ఆధీనంలో ఉన్న సర్వసంపదలలోనూ మనకు వాటా ఉంది. ఆ సంపదలన్నీ మన సహకారంవల్లే వారికి సిద్ధించాయి. వెనక సముద్రుని మథించినప్పుడు లభించిన అమూల్యమైన సంపదల నన్నింటినీ వాళ్ళు మన రాక్షసుల నన్యాయంచేసి తమవశం చేసుకున్నారు. అమృతాన్ని గ్రోలిన మన రాహువు తల నరికిన క్రూరులు వాళ్ళు. వాళ్ళను క్షమించడమనేది మన దౌర్బల్యానికొక నిదర్శనం" అన్నాడు.

సహజ సిద్ధమైన రాక్షస ప్రవృత్తి జలంధరుడిలో విజృంభించింది. తమకు న్యాయంగా రావలసిన సంపదను తమకిమ్మని ఇంద్రుని వద్దకు ఘస్మరుడనే రాక్షసుణ్ణి దూతగా పంపాడు జలంధరుడు.


ఇంద్రుడు వెటకారంగా నవ్వి "మీకు మాతో వాటా ఏమిటి? మేము దేవతలం; మీరు అధమాధములైన రాక్షసులు. గర్వంతో మిట్టిపడే మీ జలంధరుడిలాంటి రాక్షసుల నెంతమందిని మా విష్ణుమూర్తి లోగడ సంహరించాడు? ఈనాడు మీ ప్రభువైన జలంధరుడు వాటా కోరుతున్నాడూ అంటే వాడికి మృత్యువు సమీపించిందన్నమాట" అని అన్నాడు.

ఘస్మరుడు తన ప్రభువైన జలంధరుడి వద్దకుపోయి ఇంద్రుడెంతటి కండకావరంతో విర్రవీగుతున్నదీ తెలియజేశాడు. జలంధరుడు ఉక్రోషంతో రెచ్చిపోయాడు. సర్వసైన్యాలనూ సమీకరించి దేవలోకంమీదికి దాడివెడలాడు. విష్ణుమూర్తి దేవతల పక్షాన పోరాడసాగాడు. రణరంగంలో ఎక్కడ చూసినా జలంధరుడే. అతడు వీరవిహారం చేస్తున్నాడు. వాని శక్తి సామర్థ్యాలను చూసి మెచ్చుకొని—"నన్నే ఎదిరించి ఇంత నైపుణ్యంతో పోరాడుతున్న నీ ధైర్యసాహసాదులు నన్నానందింపజేస్తున్నాయి. నీకు కావలసిన వరం కోరుకో. ఇస్తాను!" అన్నాడు విష్ణుమూర్తి.

• • •

జలంధరుడు పరమానందభరితుడై "పరంధామా! నువ్వు లక్ష్మీసమేతుడవై నా భవనంలో ఉంటే నాకంతే చాలు!" అన్నాడు.

విష్ణుమూర్తి లక్ష్మీసమేతుడై జలంధరుని భవనంలో నివసించేటందుకు వెడలిపోగానే దేవ



మదురైలోని గాంధీ మెమోరియల్ మ్యూజియం

ఫోటో—ఎ. డి. కె. మూర్తి (మద్రాసు-11)

తలపక్షాన పోరాడేవాళ్ళు లేకపోవడంచేత వాళ్ళు ఓడిపోయారు.

దేవతలు మహామేధావి అయిన నారదుని దగ్గరకువెళ్ళి మొరపెట్టుకున్నారు. నారదుడు చిరునవ్వు నవ్వి—"మరేమీ భయంలేదు!" అని దేవతలకు ధైర్యంచెప్పి తిన్నగా జలంధరుడి దగ్గరకువెళ్ళాడు. జలంధరుని ఐశ్వర్యంచూసి సంతోషంతో ఉబ్బిపోయినవాడిలా నటించి—"ఓ జలంధరా! ఈ పదునాల్గు లోకాలలోనూ ఎవరికీ లేనంత ఐశ్వర్యం నీకీనాడుంది. కానీ స్త్రీలలో రత్నమనదగిన పార్వతి నీ ఆధీనంలో లేని కారణంచేత నీ ఈ ఐశ్వర్యానికి శోభచేకూర లేదు. శ్మశానాలలో తిరిగే ఆ శివుడికి మహా సౌందర్యవతి అయిన పార్వతి ఎందుకు చెప్పు?—నువ్వు తల్చుకుంటే ఆ పార్వతిని నీదానిగా సునాయాసంగా చేసుకోగలవు!" అని రెచ్చగొట్టాడు.

జలంధరుని శరీరం కామోద్రేకంతో ఉప్పొంగిపోయింది. వివేకాన్ని కోల్పోయాడు.

పార్వతిని తనదానిగా చేసుకోవాలి!

ఎలా?

ఆమె శక్తి స్వరూపిణి!

తనకు లొంగుతుందా?

అనుమానించాడు జలంధరుడు!

"అనుమానించకు జలంధరా. శివుని రూపంలో పార్వతి వద్దకువెళ్ళి ఆమె శీలాన్ని మొదట చెడగొట్టు. ఆ తరువాత కథ నేను నడిపిస్తాను" అన్నాడు నారదుడు.

• • •

జలంధరుడు ఇక కొద్ది క్షణాలలో కైలాస గిరికి వస్తాడనగా నారదుడు పార్వతి దగ్గరకెళ్ళి —"జలంధరుడు శివుని రూపంలో వస్తాడు, జాగ్రత్త!" అని హెచ్చరించి వెళ్ళిపోయాడు.

పార్వతి ఈ సంగతిని తన భర్తకు తెలియజేసింది. రుద్రుడు మహోగ్రుడై సర్వగణాలనూ జలంధరుడిపైకి పంపాడు. యుద్ధం తీవ్రంగా సాగుతూంది. బలాబలాలు సమానంగా ఉన్నాయి.

పరమశివుని ఆగ్రహానికి తనభర్త గురైనాడన్న సంగతి వృందకు తెలిసింది. ఆమె హృదయం ఆందోళనతో పరితపించసాగింది. ఆమెకు తిండి సహించలేదు. కన్నుమూస్తే చాలు; ఏవేవో అశుభదాయకమైన కలలు. అనేకమైన అపశకునాలు ఆమె మనోవ్యాకులతను ద్విగుణీకృతం చేసినాయి. మనశ్శాంతి లభిస్తుందేమోననే ఆశతో ఉద్యాన వనానికి వెళ్ళింది. అక్కడ ఆమెకేమీ తోచలేదు. ఆ ఉద్యానవనానికి ఆవలనున్న కాననం లోనికి మతిహీనురాలివలె మెల్లమెల్లగా ప్రవేశించింది.

• • •

జలంధరుడు శివునిచే హతుడుకావాలంటే మహాపతివ్రతఅయిన వృంద శీలాన్ని చెరచాలి. ఆ పనికి పార్వతీదేవిచే విష్ణుమూర్తి నియుక్తుడయాడు.

ఓ చెట్టుక్రింద వృద్ధముని రూపంలో ఆసీనుడై ఉన్న విష్ణుమూర్తి వృంద దృక్పథంలో పడ్డాడు. అతనిని ఓ గొప్ప మహామునిగా భావించి "ఓ మునీశ్వరా! తాము త్రికాలజ్ఞులవలె నాకనులకగపడుతున్నారు. తమకు తెలియని విషయాలుండవు. శివునితో పోరాడుతున్న నా భర్తగారి క్షేమ సమాచారం తమ దివ్యదృష్టికి గోచరించినట్లయితే తెలియజేయమని నా ప్రార్థన!" అని వినయపూర్వకంగా ప్రార్థించింది వృంద.

"నీ భర్త శివునిచే సంహరింపబడ్డాడు" అని అబద్ధమాడడానికి ఆ కపటముని ఏమీ సంశయించలేదు.

ఆమాట వినివెంటనే వృంద భరింపశక్యంకాని శోకంతో మూర్ఛిల్లింది.

కొంతసేపటికి మూర్ఛనుండి తెప్పరిల్లి "తాము మహామహిమాన్వితులయిన తపోధనులు. తమకసాధ్యమైనదేదీ ఉండదు. ఎలాగైనా నా భర్తను బ్రతికించండి!" అని దీనంగా ప్రార్థించింది.

వృద్ధముని వేషధారి అయిన విష్ణుమూర్తి కొద్దిక్షణాలసేపు ఏదో జపించినట్లు నటించి—"వృందా!....నువ్విక్కడే ఉండు. నీ భర్తను నీ సన్నిధికి పంపిస్తాను" అని చెప్పి అచ్చటినుండి వెడలిపోయాడు.

కొంతసేపయాక జలంధరుడి వేషంలో విష్ణుమూర్తి వృంద దగ్గరకువచ్చి "వృందా! దివ్యమైన మన అంతఃపురాన్ని వదలిపెట్టి ఈ కాననంలో ఇలా ఒంటరిగా సంచరిస్తున్నావేం? నీకు మతిచలించలేదు కదా?" అని అడుగుతూ ఆమెను బిగియార కౌగలించుకున్నాడు.

అతను నిజంగా తనభర్త అని నమ్మింది వృంద. ఆమె పాతివ్రత్యం మంటగలిసిపోయింది.

**ఆకుండి నారాయణమూర్తి**

అదే సమయంలో జలంధరుడు శివునిచే హతుడయాడు. దేవదుందుభులు అంబరవీధిలో మారుమ్రోగాయి.

దేవదుందుభులమ్రోత వినేసరికి తాను మోసపోయిందేమోననే అనుమానం వృందకు కలిగింది. తలెత్తి మీదికి చూసింది. చెట్టుపైనున్న కోతులజంట—"నీ పాతివ్రత్యం మంటగలిసిపోయిందిలే!" అని అపహాస్యం చేసినట్లుగా కిచకిచమని నవ్వాయి.

వృంద అమితమైన కోపంతో—"నువ్వు నిజంగా నా భర్తవేనా?— నా భర్త జీవించి ఉండగా దేవతలకు విజయం చేకూరడమనేది అసంభవం! నా భర్త రూపంలోవచ్చి నన్ను మోసంచేసిన ధూర్తుడిలాగున్నావు. నిజం చెప్పు" అని అడిగింది.

విష్ణుమూర్తి మౌనం వహించాడు.

వృంద నేత్రాలలోంచి విస్ఫులింగాలు రాలుతున్నాయి. ఆమె మహాకోపంతో—"నువ్వు నిజంగా నా భర్తవి కానట్లయితే నరుడవై జన్మించి, భార్యా వియోగ దుఃఖంతో కుమిలి పోతావు!" అని శపించింది.

విష్ణుమూర్తి యథారూపంతో ఆమె ఎదుట సాక్షాత్కరించి... ప్రత్యక్షమైపోయాడు. తన పాతివ్రత్యాన్ని భంగపరిచిన వ్యక్తి సాక్షాత్తూ ఆ విష్ణుమూర్తే అని తెలుసుకొని నివ్వెరపోయింది వృంద.

"అంతా విధివ్రాత! ఎవరైనా అనుభవించక తప్పదు!" అంటూ విష్ణుమూర్తికి మనస్ఫూర్తిగా నమస్కరించి, "నరుడవై జన్మించి భార్యా వియోగ దుఃఖాన్ని కొంతకాలం అనుభవించినా— తిరిగి వానరుల సహాయంతో నీ భార్యను నీవు తెచ్చుకుంటావు!" అని శాప తీవ్రతను తగ్గించింది వృంద.

శీలం చెడిన తన తనువు ఇక వ్యర్థమని భావించి, చితినిపేర్చి రగిల్చి అందులోపడి దగ్ధమయిందామె!

వృంద శరీరం కాలి భస్మమయినచోట పరమ పవిత్రమైన తులసి బీజాలు మొలకెత్తాయి.

(శివపురాణంనుంచి.)